ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం



నేడు కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ రాక

పార్వతీపురం : రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ ఆదివారం సాయంత్రం పట్టణానికి రానున్నారు. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు, ప్రతినిధులతో ఆయన సమావేశం కానున్నారు. పట్టణంలోని సిఎస్ఎన్ కళ్యాణమండపంలో ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, కార్పొరేషన్ డైరెక్టర్లు గొట్టాపు వెంకట నాయుడు, మధుసూదనరావు కూడా ఈ సమావేశానికి హాజరవుతారు. వెలమ కార్పొరేషన్ ద్వారా సంఘం సభ్యులకు చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించడం, సంఘాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి మన్యం జిల్లాలోని కొప్పల వెలమ సంఘం సభ్యులంతా హాజరు కావాలని జిల్లా సంఘం అధ్యక్షులు చెల్లారపు రమేష్, ప్రధాన కార్యదర్శి చొక్కాపు వెంకటరమణ కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమంటూ గత, ప్రస్తుత పాలకులు ప్రసంగాల్లో గొప్పలు తప్ప హామీలు కార్యరూపం దాల్చడం లేదు. అందుకు నిదర్శనమే పెద్దగెడ్డ జలాశయ దుస్థితి. జలాశయ ఆధునికీకరణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. మూడేళ్లలో 10 శాతానికే కాలువల లైనింగ్ పనులు పరిమితమయ్యాయి. ప్రధాన పిల్ల కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. నిధులు రాకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు సాగునీరు అందడంపై రైతుల్లో అనుమానాలు నెలకొన్నాయి.



పెద్దగెడ్డ రిజర్వాయర్

నిధులు రాలవు నీరు పారదు

- 10 శాతానికే పరిమితమైన లైనింగ్ పనులు
- శివారు ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకమే
- ఆందోళనలో రైతులు
- ఇదీ పెద్దగెడ్డ జలాశయ దుస్థితి

ప్రజాశక్తి-పాచిపెంట

మూడేళ్ల క్రితం జపాన్ నిధులతో చేపట్టిన పెద్దగెడ్డ జలాశయ కాలువల లైనింగ్ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. రైతులు పెట్టుకున్న ఎన్నో ఆశలు అడియాశలు అయ్యాయి. జైకా నిధుల బిల్లులు సక్రమంగా మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు పనులు చేయకుండా తప్పుకున్నారు. పెద్దగెడ్డ జలాశయ పిల్ల, ప్రధాన కాలువల లైనింగ్ పనులు రూ.28.13 కోట్లతో సుమారు 35 కిలోమీటర్ల మేర చేపట్టాల్సి ఉంది. మూడేళ్లలో ఇప్పటికీ రెండున్నర కిలోమీటర్లు మాత్రమే లైనింగ్ పనులు జరిగాయి. దీంతో జలాశయ ఆధునికీకరణ పనులు జరగక గత మూడేళ్లుగా ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రస్తుతం జలాశయ నీటిమట్టం సుమారు మూడు మీటర్లు తక్కువ ఉంది. జలాశయం పూర్తి నీటిమట్టం 213.8 మీటర్లు కాగా, ప్రస్తుతం 210 మీటర్లు ఉంది. ఇదే నీటిమట్టంతో 12 వేల ఎకరాలకు ఈ ఖరీఫ్‌కు నీరు అందిస్తే అక్టోబర్ నెల వరకే నీరు అందించగలమని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. నీటి సామర్థ్యం పెంచితే తప్ప ఉపయోగం లేదని రైతులు చెబుతున్నారు. ఇన్ని సమస్యలతో పెద్దగెడ్డ జలాశయం ద్వారా ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమే.. అంటూ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకుని, పనులు ప్రారంభించి, ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని కోరుతున్నారు.



మధ్యలో వదిలేసిన కాలువ లైనింగ్ పనులు

యోగా జీవన విధానంలో భాగం


కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ • జిల్లాలో 3150 వేదికల్లో యోగాసనాలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

యోగా మన జీవన విధానంలో భాగం కావాలని, అప్పుడే ఒక మంచి భారతావనిని సృష్టించవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరి దైనందిన జీవితంలో యోగాను అలవాటుగా మార్చుకుంటే ఎటువంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తవని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగా డేను శనివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని యోగాసనాలను వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,150 వేదికల ద్వారా 5 లక్షల మంది ప్రజలు యోగాలో పాల్గొన్నారని అన్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5వేల మందితో యోగాను నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ 15 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వరకు వయసు గల వారందరూ భాగస్వాములు అయ్యారని, ఇది శుభదాయకమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యోగా నిర్వహణ కోసం 3,160 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో జరిగిన యోగాంధ్ర పోటీల్లో జిల్లాకు 10 పతకాలు వచ్చాయని, రాష్ట్రస్థాయిలో జిల్లా ద్వితీయ స్థానంలో ఉందని గుర్తుచేశారు. దీనికోసం అహర్నిశలు కృషి చేసిన వైద్య సిబ్బంది, జిల్లా యంత్రాంగం, జిల్లా అదికారులు, సచివాలయ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అనంతరం యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేసిన అధికారులకు, యోగా గురువులకు జ్ఞాపికలను అందించి, సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను, యోగాసనాలు చేసిన వారికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు కె.మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, రఘు, జిల్లా ఆయుష్ అధికారి బి.సుశీల, డ్వామా పీడీ కె.రామచంద్రరావు. మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి ఆధ్వర్యంలో యోగాడేను నిర్వహించారు. యోగా శిక్షకులు సింహాచలం పర్యవేక్షణలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ రంగనాథం, ఎఆర్ ఆర్ఐ నాయుడు, సిఐ సుధాకర్, ఎఎ జి.సతీష్ బాబు పాల్గొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ప్రభుత్వ సహాయ న్యాయవాది బి.సత్యనారాయణ ఆధ్వర్యాన యోగాడే నిర్వహించారు. **సీతంపేట :** సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాంధ్ర ఆకృతిలో కూర్చొన్నారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల పాల్గొన్నారు. **సాలూరురూరల్ :** సాలూరు పట్టణంలోని విద్యాసంస్థల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ మాట్లాడారు. ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, ప్రత్యేక అధికారి డాక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. **కురుపాం :** కురుపాం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆవరణలో న్యాయవాది బరాటం చంద్రమౌళి ఆధ్వర్యంలో యోగాడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి తేజేశ్వరరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎ.సురేష్ కుమార్, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఎపిఎం బి.వెంకట్, ఎపిఒ పి.బావాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.వేణుగోపాల్ పాల్గొన్నారు. **సీతానగరం :** సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, అధికారులు యోగాసనాలు వేశారు. **మక్కువ :** మక్కువ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎన్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో యోగాడే వేడుకలు నిర్వహించారు. **వీరఘట్టం :** వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మండల ప్రత్యేకాధికారి ఆర్.కృష్ణవేణి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఇఒ బి.కోటేశ్వరరావు, వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్, సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్లా హరిబాబు పాల్గొన్నారు.



పార్వతీపురంలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఉన్నతాధికారులు, విద్యార్థులు



విజయనగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి చీమలపాటి రవి, న్యాయమూర్తులు బివిఎల్ఎన్ చక్రవర్తి, ఎవి శేష సాయి పాల్గొన్నారు.

యోగా పేరుతో సమస్యలు పక్క దారి

స్టీల్ ప్లాంటును ప్రభుత్వ రంగంలో ఉంచుతామని మోడీ హామీ ఇవ్వాలి : సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజలు వ్యక్తిగతంగా ఆచరించాల్సిన ఒక కార్యాచరణ అయిన యోగాను ప్రభుత్వ కార్యక్రమంగా మార్చి కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ విమర్శించారు. యోగా పేరుతో సమస్యలు పక్కదారి పట్టాయని అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత రెండు నెలలుగా యోగా ని ప్రమోట్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న తాపత్రయం ఆశ్చర్యం కలిగిస్తున్నదని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేసే విధంగా కూటమి నాయకులు మోడీని ఒప్పించే ప్రయత్నం చేయకుండా, మోడీని ప్రసన్నం చేసుకునేందుకు యోగాను సాధనంగా చేసుకోవడం మరి విడ్డూరంగా ఉందని విమర్శించారు. మోడీ పాల్గొనే ఈ యోగా కార్యక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 3 వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని విమర్శించారు. వేలాది ఆర్టీసీ బస్సులను ఈ కార్యక్రమానికి మళ్ళించడం వలన ప్రజలు రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. మోడీని ప్రసన్నం చేసుకునేందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న తపన తప్ప దీనిలో ఎలాంటి ప్రజా ప్రయోజనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి , గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో వైద్య సౌకర్యాలు మెరుగుదలకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు దఢమైన సంకల్పంతో కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్రకార్యదర్శి కె.సుబ్బరావమ్మ

'కొటియా' సమస్యలపై పాదయాత్ర

దశాబ్దాల కాలం నుంచి ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో వివాదాస్పదంగా ఉన్న కొటియా గ్రామాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన శనివారం పాదయాత్ర చేపట్టారు. సాలూరు మండలం ఎగువశెంబి గ్రామంలో పాదయాత్రను ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఎగువకొటియా, దిగువ కొటియా, ముడకారు, బర్నపాడు, పగులుచెన్నూరు, పట్టుచెన్నూరు గ్రామాల మీదుగా కొనసాగుతుంది.

(మరిన్ని వివరాలు మెయిన్‌లో)



పాదయాత్రను ప్రారంభిస్తున్న ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైసిపి నాయకులు, యువజన విభాగం సభ్యులు

23న యువత పోరు

విజయవంతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఈ నెల 23న చేపట్టే యువత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో వైసిపి యువజన విభాగం ఆధ్వర్యాన యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో నిరుద్యోగులు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి, గెలిచాక వెన్నుపోటు పొడిచిందన్నారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు ఏడాది కాలంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి చివరికి ఉన్న ఉద్యోగాలు పీకేస్తూ నిరుద్యోగులను నిలువునా ముంచేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి, ఎగనామం పెట్టడమే కాకుండా ఏడాది కాలంగా విద్యార్థులను, యువతను మోసం చేశారని దుయ్యబట్టారు.

తక్షణమే కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరుతూ వైసిపి యూత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంతో పాటు జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించనున్నట్లు ప్రకటించారు. యువత అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నగిరెడ్డి శరత్ బాబు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గ అధ్యక్షులు పల్లా అనంత్ నాయుడు, కోరాడ శేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ముగడ జగన్మోహనరావు, కౌన్సిలర్లు కోరాడ శ్రీనివాసరావు, ఎస్.లావణ్య, చీకటి అనురాధ, ఎస్.సుధీర్, వి.నేతాజీ, శంకర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి పెద్ద కష్టాలే

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ ఏరియా ఆస్పత్రిలో రోగులకు కష్టాలు తప్పడం లేదు. వంద పడకల ఆస్పత్రి చూడ్డానికి పెద్ద భవంతి. ఆస్పత్రిలో హడావుడి అయితే వచ్చిన రోగులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఒపి విభాగంలో కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. దీంతో విసన కర్రలతోనే చంటి పిల్లలకు విసురుకుంటూ వైద్యుల కోసం ఎదురు చూడడం 'ప్రజాశక్తి' కంటపడింది.



ఫ్యాన్లు లేక చంటిపిల్లాడికి విసనకర్రతో విసురుతల్లి తల్లి

వెంపలగూడలో ఏనుగుల తిష్ట

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో గత వారం రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. గత రెండు రోజులుగా వెంపలగూడ టేకు తోటల్లో ఏనుగులు తిష్ట వేశాయి. అరటి, మామిడి, పనస తోటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రోడ్డు పక్కనే వెళ్తున్న ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులు ఘీంకారాలతో చుట్టుపక్కల గ్రామాల గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది.



తోటల్లో సంచరిస్తున్న ఏనుగు

నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-సీతానగరం

జాయింట్ పట్టాదారులంతా ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు చెప్పారు. భూ రీసర్వే గ్రామాల్లో జాయింట్ పట్టాదారుల వల్ల కొన్ని సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రభుత్వం దృష్టికి సమస్య వెళ్లిందని తెలిపారు. అటువంటి కుటుంబాలకు ఆయా గ్రామ సచివాలయ పరిధిలో రూ.50 చలానాతో దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వ పథకాలు అందించేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు.

నెల రోజులు 'యోగా'ర్పణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గతనెల 21న చేపట్టిన యోగా ప్రచారపర్వం శనివారంతో ముగిసింది. మోడీని ప్రసన్నం చేసుకునేందుకు జనాన్ని వాడుకోవాలన్న కూటమి ప్రభుత్వ వ్యూహం నెరవేరింది. ఇందుకోసం అధికారులు మొదలుకుని, చిరుద్యోగుల వరకు ఎంతో శ్రమించారు. శిబిరాలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. బదిలీల్లో రాజకీయ సిఫార్సులను పక్కన బెట్టినందుకు ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు ఒకానొక సందర్భాల్లో అలకబూనినప్పటికీ అధికారుల పగడ్బందీ ప్రణాళిక వల్ల దారికి రాక తప్పలేదు. విశాఖ సముద్రతీరంలో శనివారం నిర్వహించిన యోగా డే కార్యక్రమానికి జిల్లా నుంచి 750 బస్సుల్లో జనాన్ని తరలించారు. అనుకున్న ప్రకారం జనాన్ని తరలించినప్పటికీ, వారిలో యోగా చేసిన వారు అంతంత మాత్రమే. ఈ సందర్భంగా బస్సులన్నీ యోగా డే నిర్వహణకు తరలించడంతో జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెల రోజులుగా అధికార యంత్రాంగాన్ని ఇదే పనిలో పెట్టడం వల్ల జనం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమస్యలన్నీ పక్కదారిపట్టాయి. చివరిరోజు హంగామా పట్ల విమర్శలు వెల్లువిరుస్తున్నాయి. 'మోడీ వస్తే మాత్రం ఇంతమంది జనాలను తరలించడం, నెలరోజుల పాటు ఇతర పనులను పక్కనబెట్టడం' అవసరమా? స్కూళ్లకు కూడా సెలవులు ఇచ్చేశారు? అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పబ్లిక్ టాక్ వినిపించింది. గడిచిన వారం రోజుల్లో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు వచ్చి యోగా డేకు ప్రజల్ని తరలించడానికి సమీక్షలు పెట్టుకున్నారే తప్ప,



ఆయా శాఖల వారిగా జనం ఎదుర్కొంటున్న సమస్యలపై మాత్రం ఏమాత్రం చర్చించలేదనే విమర్శలు తారా స్థాయికి చేరాయి. నోరు విప్పితే రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు కూడా పుట్టడం లేదంటున్న ప్రభుత్వం యోగా పేరిట రూ.కోట్లు ఖర్చు చేయడానికి ఎలా వచ్చాయంటూ జనం నుంచి తీవ్ర అసహనం వ్యక్తమౌతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువతీ యువకులు అల్లాడిపోతుంటే యోగా చేసుకుంటే మానసిక ప్రశాంతత పొందవచ్చంటూ ప్రచారం చేయడం ప్రజల్ని తప్పుదారి పట్టించడమేనన్న వారూ లేకపోలేదు. వాస్తవానికి మన జిల్లాలో పేద కుటుంబాలే అధికం. తినడానికి తిండి కూడా లేనివారెందరో. తినడానికి తిండిలేక జనం అల్లల్లాడిపోతుంటే.... తిన్నది అరిగించుకోమన్నట్టు యోగా డేకు తరలించారు. మింగ మెతుకు లేకపోయినా మీసానికి సెంపంగి నూనె రాసుకుని మరీ రమ్మన్నట్టుగా రోజువారీ కూలి పని వదులుకుని మరీ యోగాకు రావల్సిందేనంటూ పట్టుబట్టారట. డ్వాక్రా మహిళల్ని బెదిరించి, ఉపాధి హామీ కూలీలను మభ్యపెట్టి తీసుకెళ్లడం గొప్పవిషయమేమీ కాదని కూడా చాలా మంది నోట వినిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన ఏడాదిలే చేసిందేమీ లేక జనాన్ని ఈ రకంగా మభ్యపెట్టి నెలరోజులపాటు కాలక్షేపం చేశాయని, లేదంటే యోగాడే ఘనంగా నిర్వహించడం, యోగా నిర్వహణకు గ్రామాలు, పట్టణాల్లో తగిన సదుపాయాలు కల్పించడం ద్వారా చిత్తశుద్ధి ప్రదర్శించేదని జనం చెప్పుకుంటున్నారు. యోగా డే నిర్వహణ గిన్నీస్ బుక్‌కు ఎక్కించాలన్న తపన వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు ఉంటే బాగుండేదని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.



పురస్కారం అందుకుంటున్న రమాదేవి

రమాదేవికి పురస్కారం

ప్రజాశక్తి-పాలకొండ

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన హిందీ ప్రచార సభ 90వ వార్షికోత్సవంలో శ్రీ కోట దుర్గ ఎడ్యుకేషన్ సొసైటీ, శివాజీ హిందీ బిఈడి ఇన్‌స్టిట్యూట్, డాక్టర్ సిఎల్ నాయుడు ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్ చొంగ రమాదేవికి హిందీ పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. ఆమెకు విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. రమాదేవి హిందీ భాషాభివృద్ధికి చేసిన కృషికి గాను ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిఎల్ నాయుడు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి ఎల్ నాయుడు పాల్గొన్నారు.

విజయనగరం భారీ స్కోర్

శ్రీరామ్ సచిన్ 152 పరుగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజ్జి క్రికెట్ మైదానంలో శనివారం నుంచి ప్రారంభమైన అంతర్ జిల్లాల మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో విజయనగరం జట్టు భారీ స్కోర్ సాధించింది. విజయనగరం జట్టు మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రీరామ్ సచిన్ అద్భుతంగా ఆడి 80 బంతుల్లో 152 పరుగులు సాధించడంతో తొలిరోజే విజయనగరం 411 పరుగుల భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు తొలి రోజు 83.5 ఓవర్లలో 411 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. టాప్ ఆర్డర్ బ్యాటర్ లోహిత్ రెడ్డి (91 పరుగులు), కార్తికేయ (63 పరుగులు) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు నాలుగు ఓవర్లు వికెట్ నష్టపోకుండా ఐదు పరుగులు సాధించింది. వేగంగా ఆడి సెంచరీ సాధించిన శ్రీరామ్ సచిన్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు, ట్రెజరర్ పిఎస్ఎన్ వర్మ, సెలెక్టర్ సర్వరాజ్ అభినందించారు.

నేటి నుంచి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-సాలూరురూరల్

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 సంవత్సరానికి 5వ తరగతిలో మిగిలిన సీట్లుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఎస్.రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థులకు ఆదివారం బాలికలకు చీపురుపల్లి పాఠశాలలో, బాలురుకు 23వ తేదీ న కొప్పర్ల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ కావలిసిన వాళ్ళు కూడా హాజరు అవ్వాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థినిలకు 26వ తేదీన నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. బాలురుకు 27వ తేదీన కొప్పర్ల గురుకుల పాఠశాలలో కౌన్సలింగ్ జరుగుతుం దన్నారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినిలకు ట్రాన్స్‌ఫర్‌లు కావలిసిన వాళ్ళు కూడా హాజరు అవ్వాలని అమె తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పాలకొండ

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నగర పంచాయతీ సమన్వయకర్త పల్ల కొండలరావు ఆధ్వర్యంలో రిషి యోగా కేంద్రంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 70 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పల్ల కొండలరావు మాట్లాడుతూ రక్తదానం చేసి పదిమందిని ఆదుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఎస్ఐ ప్రయోగమూర్తి మాట్లాడుతూ రిషి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి, వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, ఏరియా ఆసుపత్రి వైద్యులు రవీంద్ర కుమార్, కె.చిరంజీవి, భారతి, బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి శివ ప్రకాశ్, సత్యస్కూల్ ప్రిన్సిపల్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ కార్మికుల సర్వే

ప్రజాశక్తి-పాలకొండ

రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహిస్తున్న గ్రామీణ కార్మికుల సర్వేలో భాగంగా శనివారం మండలంలో తుమరాడ గ్రామంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా హమాలీలతో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము మాట్లాడి, వివరాలు సేకరించారు. సర్వేలో సీత, బి.అమరవేణి, కె.రాము, జి.పారినాయుడు ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థినులకు కీర్తిశేషులు కొమ్మినేని కిశోర్‌కుమార్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఆయన తల్లి కొమ్మినేని నాగమ్మ నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి, బేత మాధవి, పి.రామక్రిష్ణ, కొయ్యాన శ్రీరాములు, గంట సోమశేఖరరావు, దేవతల రామారావు పాల్గొన్నారు.

జరడ మాజీ సర్పంచ్ కృష్ణారావు మృతి

ప్రజాశక్తి - కురుపాం



కృష్ణారావు (ఫైల్)

మండలంలో జరడ పంచాయతీ మాజీ సర్పంచ్ ఊయక కృష్ణారావు (42) తీవ్ర అస్వస్థతకు గురై శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి సర్పంచ్‌గా చేసిన సమయంలో అందరితో కలివిడిగా ఉండి పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలు మన్ననలు పొందారు. వారి కుటుంబంలోనే దశాబ్దాలుగా సర్పంచ్ పదవి పొందుతూ ప్రజలకు సేవ చేస్తూ అందుబాటులో ఉంటున్నారని, ఇప్పుడు ఆయన మరణం ప్రజలకు తీరనిలోటని స్థానిక యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

గాయత్రి విద్యాసంస్థల్లో తనిఖీలు

ప్రజాశక్తి-వీరఘట్టం

అసత్య ప్రకటనలు చేసి తల్లిదండ్రులను మభ్యపెడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం శ్రీగాయత్రి పాఠశాల, కళాశాలలో డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి తనిఖీ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, అర్హత లేని ఉపాధ్యాయులను నియమించి విద్యను కొనసాగిస్తున్నారని, పిల్లలు ఆడుకునేందుకు క్రీడా స్థలాలు లేవని, తదితర అంశాలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మండల విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈనేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు డిప్యూటీ డిఇఒ తెలిపారు. ఏ ప్రయివేట్ పాఠశాల అయినా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, శ్రీ గాయత్రి పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సింహాచలం ఉన్నారు.

వేట లేక పూట గడవక..

●ఏడాదిగా కొనసాగుతున్న నిషేధం ●లీజు సొమ్ము చెల్లించలేదని మత్స్యశాఖ చర్యలు ● హైకోర్టు ఆదేశాలు బేఖాతరు



వేట లేకపోవడంతో ఒడ్డుకు చేరిన పడవలు

ప్రజాశక్తి- వంగర

తమ భూములు సైతం మడ్డువలస ప్రాజెక్టుకు అంకితం చేసి తమ పొట్ట పోషణ కోసం మడ్డువలస ప్రాజెక్టులో చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న మత్స్యకారులను మత్స్యకార సొసైటీ నుంచి లీజు సొమ్ము చెల్లించలేదనే నెపంతో అధికారులు వేటకు వెళ్ళనీయకుండా నిషేధాజ్ఞలు విధించారు. దీంతో ఏడాదిగా వేట లేక పూట గడవక వివిధ గ్రామాలలో ఉన్న మత్స్యకారులు వలస బాట పడుతున్నారు. కొట్టేశ శ్రీ సీతారామ మత్స్యకార సొసైటీ సంఘం కాలపరిమితి ముగియడంతో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆ దిశగా మత్స్యకార శాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎన్నికలు నిర్వహించి కొత్త అధ్యక్షులు, కొత్త కమిటీ సభ్యులు వస్తే లీజు చెల్లించి తిరిగి వేటకు వెళ్లవచ్చునని మత్స్యకారులు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వంగర మండలంలో గల మత్స్యకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

మండలంలోని 15 గ్రామాల్లోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద కుటుంబాలకు చెందిన 574 మంది మత్స్యకారులు కొట్టేశ శ్రీసీతారామ మత్స్యకార సొసైటీగా ఏర్పడి గొర్లె శ్రీరాముల నాయుడు మడ్డువలస ప్రాజెక్టులో కొన్నేళ్లుగా చేపల వేట చేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా కూడా సొసైటీ ద్వారా ప్రభుత్వానికి కొంత లీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లీజు సొమ్ము వ్యవహారం, ప్రభుత్వం నుండి మత్స్యకారులకు అందించవలసిన రాయితీలు తదితర వ్యవహారాల్ల మత్స్యశాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. గతంలో సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యత వహించిన సమయంలో సొసైటీ తరపున ప్రభుత్వానికి కట్టవలసిన సఫలీల లీజు సొమ్ము సుమారు రూ.57 లక్షల కట్టించుకోవలసిన మత్స్యశాఖ అధికారులు కూడా నిర్లక్ష్య ధోరణితో ఉండిపోవడంతో ఆ సొమ్ము సొసైటీ నుంచి ప్రభుత్వానికి చెల్లించలేదు. ఇంతలో మత్స్యకార సొసైటీ కాల పరిమితి కూడా ముగిసింది. దీంతో మత్స్యకారులు ఎవరూ కూడా ప్రాజెక్టులో చేపల వేట చేయకూడదని అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. ప్రస్తుతం కూడా చేపల వేట చేయకుండా నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. అధికారులు కూడా మత్స్యకార సొసైటీని రద్దుచేసి చేపల వేట చేసేందుకు బహిరంగ వేలం వేసేందుకు ఇటీవల ప్రకటన కూడా చేశారు.

చాలామంది వలసలు వెళ్ళిపోతున్నారు

మేమంతా చాలా పేద కుటుంబాలకు చెందిన వాళ్ళం. మడ్డువలస ప్రాజెక్టులో చేపల వేట చేసుకుంటూ ఇన్నాళ్లు జీవనం సాగిస్తున్నాం. చేపల వేట చేయొద్దని నిషేధించడంతో కుటుంబాలతో రోడ్డును పడ్డాం. చాలామంది మత్స్యకారులు వలసలు వెళ్ళిపోతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వేట సాగించే విధంగా చర్యలు చేపట్టాలి.

సిగిరి నరసిం దొర, మత్స్యకారుడు సంగాం.

ఇబ్బందులు పడుతున్నాం

చేపల వేటలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. మత్స్యకారులకు జీవనోపాధికి ఆటంకం లేకుండా చూడాలి. ఎన్నికలు నిర్వహిస్తే కమిటీ ఏర్పడి లీజు సొమ్ము చెల్లించే అవకాశం ఉంటుంది. రహస్య ఓటింగ్ నిర్వహించాలి.

సూరిమల్లి శ్రీను, మత్స్యకారుడు, మగ్గూరు.

హైకోర్టును ఆశ్రయించిన మత్స్యకారులు

చేపల వేట చేసిన శ్రీసీతారామ మత్స్యకార సొసైటీని రద్దుచేసి ఇందులో చేపల వేట సాగించేందుకు ఓపెన్ ఆక్షన్ వేసేందుకు అధికారులు ప్రకటన చేసిన విషయాన్ని తెలుసుకున్న కొంతమంది మత్స్యకారులు హైకోర్టుని ఆశ్రయించారు. దీంతో ఇక్కడ గతంలో ఉన్న సొసైటీకి ఎన్నికలు నిర్వహించి కమిటీని నియమించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్‌ను కూడా మత్స్యకారులు ఇటీవల కలిసి తమ గోడును తెలియజేశారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు జోక్యం చేసుకొని ఎన్నికలు నిర్వహించి చేపల వేట నిషేధాజ్ఞలు ఎత్తివేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

ఈ నెల 19న మత్స్యకారులు అందరితో మాట్లాడేందుకు జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశాం. ఈ సమావేశంలో ఎన్నికలు నిర్వహిస్తే బ్యాలెట్ ఓటింగ్ పెట్టాలని మత్స్యకారులు కోరారు. రహస్య ఓటింగ్ నిర్వహించాలంటే ముందుగా లక్ష రూపాయలు డిపాజిట్ చేయవలసి ఉంటుంది. మత్స్యకారుల సమస్యలపై ఉన్నతాధికారులకు నివేధించి వేటపై ఆలోచన చేస్తాం.

సిహెచ్ వివి ప్రసాద్ మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రాజాం.

గాడితప్పిన సచివాలయ వ్యవస్థ

● బదిలీల్లో బిజీబిజీ

● ప్రజలకు తప్పని పాట్లు

ప్రజాశక్తి-మక్కువ



పనసభద్ర సచివాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న గిరిజనులు (ఫైల్)

గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గత వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి కావచ్చినా ఆ సచివాలయ వ్యవస్థలో ఆశించిన రీతిలో సేవలు అందడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇటీవలే ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రస్తుతం మండలంలో ఉన్న 17 సచివాలయాల పనితీరు మరింత గాడి తప్పిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది కాలంగా సచివాలయ వ్యవస్థ పనితీరును సరిగా పట్టించుకోకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన సంక్షేమ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం లబ్ధిదారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటివరకు చాలామంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన 13 వేల రూపాయలు జమ కాలేదు. తప్పులు సరిదిద్దుకునేందుకు ఈ నెల 20 వరకు గడువు కూడా ప్రభుత్వం ఇచ్చినా వాటిని సరిచేసే నాథుడు లేడని పలువురు గిరిజనులు ఇటీవల పనసభద్ర సచివాలయం వద్ద నిరసన కూడా తెలియజేశారు.

అంతేకాకుండా వివిధ పనుల కోసం సచివాలయాలకు వెళ్లే ప్రజలకు అక్కడ సిబ్బంది లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. బదిలీల ప్రక్రియలో తలమునకలైన సిబ్బంది పూర్తిగా సేవలను మరచి వారి సొంత పనులకే ప్రాధాన్యతనిస్తున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అన్ని విధాలా సేవలు అందేలా, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

భూ సమస్యలపై రేపు ధర్నా

ప్రజాశక్తి-కొమరాడ

భూ సమస్యలపై ఈనెల 23న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు కూనేరు సంతలో శనివారం ప్రచారం, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గిరిజనులు తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్న పోడు భూములకు 2006 అటవీ హక్కుల చట్ట ప్రకారం పది ఎకరాల వరకు పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. పది ఎకరాలు సాగు చేస్తే 8 ఎకరాలకు, 8 ఎకరాలు పోడు భూమి సాగుచేస్తే ఆరు ఎకరాలకు.. ఇలా తగ్గించి పట్టాలు ఇస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని చెప్పారు. ఆ పట్టాలపైనా అటవీ శాఖ అధికారుల సంతకాలు కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి సందర్భంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు 10 ఎకరాల వరకు పట్టాలు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ కింద డబ్బులు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ధర్నాలో గిరిజన రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చెంబరు వెంకటరావు, సుబ్బారావు, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, గణేష్, మధు పాల్గొన్నారు.



సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి, నాయకులు

మాజీ జెడ్‌పిటిసి తిరుపతినాయుడు మృతి



రెడ్డి తిరుపతినాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర



తిరుపతినాయుడు(ఫైల్)

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గ రాజకీయాల్లో భీష్ముడు లాంటి సీనియర్ నాయకుడు, మాజీ జెడ్‌పిటిసి రెడ్డి తిరుపతినాయుడు (85) శుక్రవారం రాత్రి అస్తమించారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ తండ్రి తిరుపతి నాయుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వృద్ధాప్యం కారణంగా బాగువలసలో ఇంటికే పరిమితమయ్యారు. మండల వ్యవసాయ అధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ తర్వాత ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు తన కనుసన్నల్లో మండల రాజకీయాలను తిరుపతి నాయుడు శాసించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జెడ్‌పిటిసిగా పని చేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు సురేష్ ఆయన తరువాత మండల రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. రెండో కుమారుడు భార్య రెడ్డి సుకన్య పెదపదం పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద కోడలు రెడ్డి పద్మావతి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా పని చేశారు. ఆమె ప్రస్తుతం వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు రాజకీయ సలహాదారుగా రెడ్డి తిరుపతి నాయుడు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. రెడ్డి తిరుపతి నాయుడు మృతికి మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర సంతాపం తెలిపారు. బాగువలస వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కళ్లేపిల్లి త్రినాథ్ నాయుడు, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు నివాళులర్పించారు. శనివారం స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

నవధాన్యాలతో కొత్త ప్రయోగం

ప్రజాశక్తి-పాచిపెంట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. 32 రకాల నవధాన్య విత్తనాలు.. '25 కిలోలను ఎకరా పొలంలో చల్లి.. 40 రోజుల తర్వాత కలియ దున్నాలి. అనంతరం మొక్కజొన్న, వరి, పొగాకు పంటలను వేయాలి. నవధాన్యాల భూసార ఫలితం ఆయా పంటలపై ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు సరికొత్త ప్రయోగాన్ని పాంచాలి గ్రామంలో రైతు సేనాపతి భాస్కరరావు పొలంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఒ తిరుపతిరావు మాట్లాడుతూ నవధాన్యాలు భూసారాన్ని పెంచడానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వరుసగా మూడు సీజన్ల పాటు నవధాన్యాలను సాగు చేసి కలియ దున్నిన అనంతరం మొదటి సంవత్సరంతో పోలిస్తే మూడో ఏడాది భూమిలో సేంద్రియ కర్బనం శాతం ఎంత పెరిగింది, దిగుబడులు ఎంత పెరిగాయి, రసాయన ఎరువులపై భారం ఎంతవరకు తగ్గుతుంది, పంట చీడపీడలను తట్టుకునే స్వభావం ఎంతవరకు మెరుగుపడుతుంది, తదితర విషయాలపై అధ్యయనం చేస్తామని తెలిపారు. రైతులకు క్షేత్రస్థాయిలో క్షేత్ర దినోత్సవాలను నిర్వహించి, ఫలితాలను వివరిస్తామని తెలిపారు. రాబోయే రోజులలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఇది ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీను, ప్రకృతి సేద్య క్లస్టర్ ఎల్‌వన్ తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

కోర్టు భవనాలకు నిధులు ఇవ్వండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శృంగవరపుకోటలో శిథిలమైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయించాలని హైకోర్టు న్యాయమూర్తి, విజయనగరం ప్రోటోకాల్ జడ్జి చీమలపాటి రవిని ఎస్.కోట న్యాయవాదులు శనివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి రవి మాట్లాడుతూ ఎస్.కోట కోర్టు భవనాల కోసం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ద్వారా ఆర్ అండ్ బి పంపిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల చేయించేందుకు ప్రయత్నాలు జరుపుతున్నారన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసుల సంఖ్య, కోర్టులకు అవసరమైన జడ్జీల ఖాళీలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా జూనియర్ సివిల్ జడ్జీల నియామకాలు చేపట్టేందుకు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఎస్.కోట, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస తదితర కోర్టుల న్యాయవాదుల సమక్షంలో హైకోర్టు న్యాయమూర్తి రవి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా గల అన్ని రకాల కోర్టుల్లో అవసరమైన ఏసీలు, ఫర్నిచర్ ఏర్పాటు చేశామని, కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర హైకోర్టు కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమై చర్చిస్తున్న విషయాన్ని కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, న్యాయవాదులు డబ్ల్యుఎన్ శర్మ, బి.సత్యనారాయణ, బడబళ్ల రామకృష్ణ, రావాడ సత్యనారాయణ, బొడ్డు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టిక తప్పనిసరి

ప్రజాశక్తి-సాలూరు రూరల్



మాట్లాడుతున్న ఎడి మధుసూదనరావు

ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని వ్యవసాయ శాఖ ఎడి ఎం.మధుసూదనరావు డీలర్లను ఆదేశించారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువులు, పురుగుల మందుల షాపుల డీలర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను అందుబాటులో ఉండే విధంగా, వాటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అలా చేయకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శిరీషా, టెక్నికల్ అసిస్టెంట్ అనురాధ, ఎఇఒలు శ్రీను, శైలజ పాల్గొన్నారు.

సాలూరు ఎఒగా శిరీషా

సాలూరు మండల వ్యవసాయాధికారిగా కె.శిరీషా శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె విజయనగరం జిల్లా బాడంగి మండలంలో ఎఒగా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న అనురాధ పండా బదిలీపై రామభద్రపురం వెళ్లారు. ఆమె స్థానంలో శిరీషా వచ్చారు.

కురుపాంలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-కురుపాం



తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎ.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. కార్యాలయ పరిసర ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల తరలింపు అమానుషం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గిన్నిస్ రికార్డు కోసం యోగాంధ్ర కార్యక్రమానికి 26 వేల మంది గిరిజన విద్యార్థులను తరలించడం అమానుషమని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. దీనివల్ల గిరిజన విద్యార్థులు ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. శనివారం పట్టణంలోని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తన గొప్పల కోసం, మోడీ మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిసు రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2 గంటలకు బస్సులో తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో విద్యార్థులకు నిద్రించడానికి సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే రీతిలో రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు పిల్లలను తరలిస్తారా? అని ప్రశ్నించారు. నిజంగా ప్రభుత్వానికి గిరిజన విద్యార్థులపై చిత్తశుద్ధి ఉంటే ఆ ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, హెల్త్ వర్కర్లను, ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేసిన రోజున గొప్పలు చెప్పుకోవాలని మంత్రి లోకేష్‌కు హితవుపలికారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి హరికృష్ణ, మండల నాయకులు వికాస్, చరణ్, గణేష్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -కురుపాం

మండలంలోని కొండలేవిడి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గుమ్మలక్ష్మీపురం నుండి కురుపాం మండలంలోని పులిపుట్టి గ్రామానికి ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా, మొండెంఖల్ నుంచి గుమ్మలక్ష్మీపురం ఎదురెదురుగా వస్తున్న ఆటో ఢీకొనంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మండంగి అనిల్, వేణు, సునీతకు గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.